మన దేశం:

# గ్రామాలలో రేషనింగ్

## అన్నంబ్రహ్మ

గ్రామసీమల్లో రేషనింగు ఎత్తివెయ్యటానికి మద్రాసు ప్రభుత్వం నిశ్చయించింది. కారణం: ఈ రేషనింగు అమలుజరపటంలో రాష్ట్రప్రభుత్వం అపూర్వమైన అసమర్థత ప్రకటించింది. అనేకచోట్ల రేషన్‌షాపుల్లో ఆహారధాన్యాలు నిండుకున్నాయి. ప్రజలు నానాఅగచాట్లూ పడ్డారు. అన్నంబ్రహ్మ అన్న ఆర్యోక్తి రుజువుచేస్తూ అన్నం బ్రహ్మస్వరూపం లాగా అవాఙ్మనసగోచర మైపోయింది. గ్రామసీమల్లో ప్రజలకు ఆహారధాన్యాలు అందించే బాధ్యతకు మద్రాసుప్రభుత్వం స్వస్తిచెబుతున్నది.

మద్రాసుప్రభుత్వం అసమర్థతకు కొంత కారణం పంటలు సరిగా పండకపోవటం. కాని ఇంకా ఇతరకారణా లున్నాయి.

రేషనింగు అమలుజరపటంలో రెండు ఉద్దేశా లుంటాయి: ఆహారధాన్యాల ధరలు అదుపులో ఉంచటమూ, ఆహార కొరత ఉన్న ప్రాంతాలకు ఆహారధాన్యాలు అందించటమూనూ.

రేషనింగు సరిగా అమలుజరపాలంటే ప్రభుత్వంవద్ద ధాన్యం ఉండాలి. ఇది రెండువిధాలుగా లభిస్తుంది. ధాన్యసేకరణ ద్వారానూ, ఆహారధాన్యాల దిగుమతి ద్వారానూ. ఆహారధాన్యాలు పైదేశాల నుంచి దిగుమతిచేసి రాష్ట్రాలకు అందించే భారం ప్రభుత్వానిది.

రేషనింగుభారం మీద వేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌డిపోలు నిండుకోకుండా చూడాలంటే సవ్యంగా ధాన్యసేకరణ చేసి, లోటును కేంద్రంనుంచి అడిగి పుచ్చుకోవాలి. ఈ పని రాష్ట్రప్రభుత్వం సరిగా నిర్వర్తించని కారణంచేత గ్రామసీమల రేషనింగుకు ఉద్వాసన చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది.

ధాన్యసేకరణవిషయంలో మద్రాసు రాష్ట్రంలో అనేక అవకతవకలు జరిగాయి. ఇవి మిగులుజిల్లాలు, ఇవి తరుగు జిల్లాలు అని బండఅంచనా పెట్టుకుని ధాన్యసేకరణ చేసి "మిగులు" జిల్లాల్లో క్షామం తెచ్చిపెట్టారు. క్షామం దొంగ వ్యాపారానికి ప్రోత్సాహం ఇచ్చింది.

రాష్ట్రమంతటా కలిసి తరుగు ఎంత ఉంటేదీ రాష్ట్రప్రభుత్వం అంచనా కట్టినట్టయితే ఆ అంచనాప్రకారం కేంద్రం నుంచి ఆహారధాన్యాలు తెప్పించుకుని ఎక్కడ లోటుంటే అక్కడికి అందజేయవచ్చు. ఆహారదిగుమతులుకూడా దేశంలోటును తీర్చలేనివాడు ఆకలిచావులు తప్పనేతప్పవు.

రేషనుడిపోలు ఖాళీఅయినచోట్ల ఆకలిచావులు హెచ్చుగా లేకపోతే అక్కడ దొంగమార్కెట్టు సాగుతున్న దన్నమాట. గ్రామసీమల్లో రేషనుషాపులు ఖాళీచేసినా, రేషనింగు ఎత్తివేసినా పర్యవసానం ఒకటే.

## అప్పు పెట్టదు, అడుక్కోనీదు

రాష్ట్రఅసెంబ్లీలో ఈ విషయమై జరిగిన చర్చలో కొందరు ఆహారమంత్రిని కేంద్రం నుంచి అదనపు ఆహారధాన్యాలు తెప్పించమన్నారు. అవసరానికి మించి అడగటం మంచిదికాదని ఆయన అన్నాడు. ప్రస్తుతం రాష్ట్రం పుచ్చుకునే ఆహారం అవసరాలకు సరిపోయేపక్షాన రేషనింగు ఎందుకు ఎత్తివేయాలో ఆయన చెప్పలేదు.


రేషనింగు ఎత్తివేసేపక్షాన దొంగమార్కెటుకేసులు పట్టకోవటం మానమని ఒకరు సలహా ఇచ్చారు. ఈ సలహా పాటించినట్టయితే ధాన్యం ఏదోధరకు బయటికి వస్తుందిగాని పేదవాళ్ల ఆకలిచావులు తప్పవు.

(7-వ పేజీ చూడండి)

రిజిష్టర్డు నెం. 4672.

అన్ని బహుమతులు గ్యారంటీ చేయుబడినవి:-

| | |
|---|---|
| అంతా సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు, 1200 లు |
| రెండువరసలు సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. 100 లు |
| ఒకవరుస సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. 10 లు |



ఇచ్చట చూపిన చదరంలో 16 నుండి 31 వరకు అంకెలు వాడినిలువుగగాని, అడ్డముగగాని, అయిమూలలుగగాని ఎటు కూడినను మొత్తం 94 వచ్చునట్లు చేయవలెను. ఒకసంఖ్య ఒకసారే వాడవలెను.

ఆఖరు పోస్టింగు తేది 20-12-50. ఫలితము 30-12-50

ప్రవేశరుసుము. ఒక ఎంట్రీ రు. 1 /-;
3 ఎంట్రీలు రు. 2/- 8 ఎంట్రీలు రు5/-లు

మొత్తం 90 కు సొల్యూషను

| | | | |
|---|---|---|---|
| 20 | 25 | 15 | 30 |
| 24 | 21 | 27 | 18 |
| 29 | 16 | 26 | 19 |
| 17 | 28 | 22 | 23 |

లోగడ ఫలితము

రూల్సు: పై రేటువంతున రుసుముతో తెల్లకాగితం మీద ఎన్ని ఎంట్రీలైనను పంపవచ్చును. రుసుము మనీ ఆర్డరుద్వారా గాని యిండియన్ పోస్టల్ ఆర్డరుద్వారాగాని, పంపవలెను. ఎంట్రీలు రిజిస్టరు కవరులో పంపితే మంచిది. ఢిల్లీలో ఒక సుప్రసిద్ధ బ్యాంకులో డిపాజిటు చేసిన సీల్డుసొల్యూషనకు సమానంగావున్న సొల్యూషనే సరియైనదిగా యెంచబడును. సెల్యూషనులో ఇంగ్లీషు అంకెలు మాత్రమే వాడి వాటి కాపి ఒకటి మీవద్ద వుంచుకొనండి. ఫలితములకుగాను ఎంట్రీలతో స్వంత అడ్రసువ్రాసి టిక్కెట్టు అంటించిన కవరు పంపవలెను. ఆర్గనైజరు తీర్పు ఖాయముగాను న్యాయబద్ధమైనదిగాను వుండును.

మీ ఎంట్రీలు, రుసుములు క్రింది అడ్రసుకు పంపండి. The Organizer,
**Redfort Trading Co., (43) Reged Post Box 337, Katra Neel, DELHI.**

# అమెరికా అంపశయ్య

### "ఈసారి మావంతు"

కొందరు సినిమా తారలు నాలుగు చిత్రాలలో నటించి నాలుగు పిచ్చికలు సంపాదించేసరికి సొంతాన చిత్రం తీద్దామని దురద పుడుతుంది. తీస్తారు. ఉన్న నాలుగు పిచ్చికలూ ఎగిరి చక్కా పోతాయి. ముందు నటించబోయే నాలుగు చిత్రాల అర్జన డిస్ట్రిబ్యూటరుకు ముందుగానే తాకట్టయిపోతుంది. ఉన్న కీర్తి కాస్తా నాశించిపోతుంది. అమెరికా సంగతి ఆవిధంగా అవుతున్నది.

"రెండు ప్రపంచయుద్ధాలలో మేం అందరికన్నా ఆఖరుగా ప్రవేశించాం. ఈసారి ప్రపంచయుద్ధానికి అందరికన్నా మేమే ముందుంటున్నాం," అని అమెరికనులు చంకలు గుద్దుకున్నారు. మొదటి ప్రపంచయుద్ధం అయేసరికల్లా ప్రపంచంలో ఉండిన బంగారంయావత్తూ అమెరికా చేరుకుంది. రెండో ప్రపంచయుద్ధం అయిపోయేసరికి ప్రపంచంలో ఎక్కడా డాలర్లు లేవు. ఎన్నో దేశాలు డాలర్లకోసం రాజకీయంగా అమెరికాకు అమ్ముడుపోవటానికి సిద్ధపడ్డాయి. అగ్రరాజ్యాలనిపించుకున్న బ్రిటను, ఫ్రాన్సులు డాలర్లకోసం చాలా ఇక్కట్లకు తమ ప్రజలను గురి చేశాయి.

అమెరికాకోరిక నెరవేరినట్టే కనపడింది. ఉత్తర అట్లాంటిక్ ఒడంబడిక కుదిరింది. పశ్చిమ రాజ్యాల యూనియన్ అమెరికా కర్రపెత్తనంకింద ఏర్పడింది. ప్రపంచమంతటా అమెరికాకు స్థావరాలు దొరికాయి. బ్రిటిషువారు షూమన్ పథకానికి వెంటనే ఒప్పుకోకపోయినా కాలక్రమాన ఒప్పుకుంటారన్న ఆశ ఒకటి ఏర్పడింది. యూరప్ సమిష్టి రక్షణపథకంకింద పశ్చిమ జర్మనీని సాయుధం చెయ్యాం పనేమిరా అని ఫ్రెంచివా రన్నప్పటికీ ఫ్రాన్సు పిలక అమెరికాపట్టునుంచి జారిపోలేదు. అంతా బాగానే ఉంది. ఇంతలో కొరియా దాపరించింది.

కొరియాను అమెరికా తెచ్చిపెట్టుకో లేదనే అనుకుందాం. కాని అందులో అమెరికా తల దూర్చింది. తల దూర్చటానికి ఎంతో ఉబలాటం ప్రదర్శించింది. కొరియా - ముఖ్యంగా ఉత్తరకొరియా - బెత్తెడు దేశం. అక్కడివాళ్లు మృగప్రాయులు. "హూష్ కాకి" అందామనుకుంది అమెరికా. కొరియా బెదరలేదు. కాకి పొడిచినట్టు పొడవసాగింది.

కొరియాకోసం యుద్ధప్రయత్నాలు అదనంగా చెయ్యవలిసివచ్చింది. ట్రూమన్ డాలర్లు కొరియాకు ఆహుతి చేయసాగాడు. ప్రపంచంలో డాలరుకొరత పూడింది. బ్రిటిషు సవరను ధరా, గిరాకీ హెచ్చింది.

కొరియాలో ఐక్యరాజ్యబలాలు ఓడి సంతపని అయి, మళ్ళీ గెలవసాగాయి. కనీసం ఉత్తరకొరియనులు దక్షిణకొరియా విడిచి వచ్చేశారు. కొరియా యుద్ధం అయిపోయినట్టూ అమెరికా పరువు నిలబడ్డట్టూ కనపడింది.

### మకార్థర్ కుదేలు

ట్రూమన్ ఒకటి తలిస్తే మకార్థర్ మరొకటి తలిచాడు. మకార్థర్ అమెరికా రాజకీయాలను పరధనంగా భావించి ఉత్తరకొరియాలో మూటం బేస్తు బెట్టి కుదేలు చేశాడు. ఆయన ఐక్యరాజ్య తాత్కాలిక కొరియా కమిటీవారు చేసిన నిర్ణయాన్ని తృణీకరించి సింగ్మన్‌రీ బలాలను ఉత్తరకొరియా బలాలవెనకగా 38వ అక్షాంశ రేఖ దాటి పంపాడు. ఉత్తర కొరియా ప్రాంతంలో దక్షిణకొరియా ప్రభుత్వం అడుగు పెట్టరాదని పైన చెప్పిన తాత్కాలిక కమిటీ నిర్ణయం అయినప్పటికి సింగ్మన్‌రీ ప్రభుత్వం తాలూకు గవర్నరులూ, సారసరి పాలనాధికారులూ "అధ్యాపకులూ" ఉత్తరకొరియా ప్రవేశించారు. ఉత్తరకొరియాలోకి పంపడమే కాక దక్షిణకొరియనుబలాలను మంచూరియా సరిహద్దువరకూ పొమ్మనికూడా మకార్థర్ ఆదేశించాడు.

తరువాత అమెరికా ఐక్యరాజ్యసమితి చేత ఐక్యరాజ్యబలాలను ఉత్తరకొరియా ప్రవేశించే అనుమతి ఇప్పించటం కేవలం మకార్థర్‌ను అమెరికా విదేశాంగశాఖ ధిక్కరించలేకపోవటమే గాని మరొకటి కాదు.

-పిట్టపోరూ పిట్టపోరూ పిల్లి తీర్చిందన్నట్టు చైనా "వాలంటీర్లు"(లేక బలాలు) మకార్థర్ మూటంబేస్తును కుదేలు చేసేశాయి. ఐనా గెలుపు నాదే నన్నాడు మకార్థర్. "ఉత్తరకొరియా బలాలను మంచూరియాసరిహద్దుదాకా తరిమి ఐక్యరాజ్య నిర్ణయం అమలుజరిపాను. కొత్తగా చైనాయుద్ధం ప్రారంభించింది. నాకు కొత్త ఉత్తరువు లివ్వండి," అన్నాడు మకార్థర్.

### "పక్కవేసుకున్నావు, పడుకో"

అమెరికా ప్రభుత్వశాఖపని అన్నందాలా అగచాట్లే అయింది. కొరియాయుద్ధం అనకున్నట్టు జరగకపోగా మానం కాపాడుకునేటందుకు చైనాతో యుద్ధానికి దిగవలసిన పరిస్థితి ఏర్పడింది. 1951 కి గాను అంచనా వేసుకున్న యుద్ధఖర్చు కాస్తా -1950 తిరక్కముందే మంజూరు చెయ్యవలసి వచ్చింది. యుద్ధం కొరియా సరిహద్దులలో ఉండగానే అమెరికాకు తీవ్ర పరిస్థితి ఏర్పడితే, 'ఈ యుద్ధం చైనాకు వ్యాపింపజేయాలంటే ఏమయ్యేదీ వూహించవచ్చు. కొరియాయుద్ధాన్ని అణువు బాంబులతో ముగించడానికి అమెరికా మిత్రదేశా లేవీ సమ్మతించలేదు. ఆఖరుకు ఆస్ట్రేలియా, కెనడాలు కూడా అక్షింతలు వేశాయి.

ఇన్నేళ్ళు అగచాట్లుపడి సాధించిన పాశుపతాస్త్రాన్ని రష్యామీద ప్రయోగించకుండా ఊరూ పేరూ లేని కొరియా సరిహద్దులో వ్యర్థంచెయ్యటం చర్చిల్ ప్రభృతు లెవ్వరికీ ఇష్టంలేదు. అసలు యుద్ధం యూరపులో రావాలనీ, బలసంపద లన్నిటినీ అక్కడే ధారపోయాలనీ వారి మతం.

అయితే ఇక్కడకూడా అమెరికాకు అవాంతరాలు కలుగుతున్నాయి. బ్రిటిషు వర్గాలలో చాలామందికి యుద్ధయత్నాల మీదా, అమెరికా నాయకత్వంమీదా ఉన్న

ట్టుంటే మోజా తగ్గిపోయింది. బ్రిటనునుండి రకరకాల సూచనలు వెలువడ్డాయి. "యూరపు రక్షణలకింద ఎవరెంత ఖర్చు చేయాలో అమెరికా చెప్పరాదు. ఎవరి శక్తికి తగ్గట్టు వారు ఖర్చుచేయాలి. మొత్తం మీద జరిగే సమష్టిప్రయత్నం యుద్ధాన్ని తెచ్చిపెట్టేటంత పెద్దఎత్తున ఉండరాదు. అమెరికా కర్రపెత్తనం చెయ్యరాదు. అందరికీ ఈ ప్రయత్నంలో సమాన హక్కులుండాలి."

ఈ ధోరణినే క్రమంగా ఇతర దేశాలు కూడా ప్రకటిస్తాయని భావించవచ్చు. కొరియాలో అమెరికాసేనలు అంతో ఇంతో విజయం సాధిస్తుండగా జరగని విమర్శలు ఇప్పుడు బయల్దేరాయి. చైనా సేనల చేతిలో "ఐక్యరాజ్య" బలాలు చావుదెబ్బ తింటూంటే, మకార్థర్ ఐక్యరాజ్యఆదేశాలను అతిక్రమించాడన్న ప్రసక్తి వచ్చింది. ఈ ఆరోపణ అధికార రీత్యా జరగకపోయినా పలుకుబడిగల వర్గాల నుంచే జరుగుతున్నది. ఇందులో అసత్యం కూడా ఆట్టే కనబడదు. సింగ్మన్‌రీ బలాలను మకార్థర్ ఉత్తరకొరియాలోకి పంపటం ఒక నిదర్శనం. ఐక్యరాజ్య విమానాలు చైనా సరిహద్దుపైకి వెళ్ళి యుద్ధప్రేరేపక చర్యలు జరపడం మరొక నిదర్శనం. ఇంగ్లీషులో పక్క వేసుకున్న వారు పడుకోక తప్పదన్న సామెత ఉన్నది. అమెరికా ఇప్పుడా పనే చేస్తున్నది.

## అమెరికా దౌర్బల్యం

అమెరికా పూర్తిగా రాజకీయ ఓటమి పొందక పోవచ్చు. కాని దౌర్బల్యచిహ్నాలు చాలా పొడచూపుతున్నాయి. యుద్ధఖర్చుమూలంగా అమెరికాలో ధరలు చాలా పెరిగిపోతున్నాయి. ఈ పెరుగుదలకు ప్రస్తుత కారణం ఉత్పత్తిదార్ల దురాశే. ఎందుచేతనంటే యుద్ధప్రయత్నాలను అడ్డంపెట్టుకుని వారు వస్తువుల ధరలు పెంచేస్తున్నారేగాని వారి రాబడిలోనూ, వాటాల ధరలలోనూ తరుగుదల ఏమీ కనిపించటంలేదు.

దీనికి తోడుగా - ఇదొక కారణంగా కూడా నేమో! - నవంబరు 7 న జరిగిన కాంగ్రెసు ఎన్నికలలో రిపబ్లికనులు తమ స్థానాలను బలపరుచుకున్నారు. డీన్ ఎచిసన్ మొదలైన కొందరు ప్రముఖ వ్యక్తులకు ఉద్వాసన చెప్పటానికి యత్నాలు జరుగుతున్నాయి.

మకార్థర్ బుద్ధిపూర్వకంగా చైనాను రెచ్చగొడుతుంటే మకార్థర్‌కూ, అమెరికా విదేశాంగశాఖకూ ఎక్కడా పొరపొచ్చాలు లేవంటూ ట్రూమన్ చైనాకు, "మీ సరిహద్దులను గౌరవిస్తాం. మీరు కొరియానుంచి పొండి," అని వాగ్దానాలు చేస్తున్నాడు. ఈ సమయంలోనే అమెరికా ఒత్తిడితో ఇండోచైనాలోనీ ఫ్రెంచి బలాలు అటునుంచికూడా చైనాసరిహద్దుపై దాడులు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

ఒక ముక్కలో చెప్పాలంటే అమెరికాకు నిర్దిష్టమైన దూరప్రాచ్యవిధానమన్నది ఈ నాటికీ లేదు. అది లేకుండానే అమెరికా దూరప్రాచ్యంలో తల ఇరికించి కూర్చున్నది.

## "ఆసియా మానని నమ్మదు"

పెసిఫిక్ సంబంధాల సంస్థ లక్నోలో సమావేశమైనప్పుడు వెరామిచిలిస్ డీన్ అనే ఆవిడ అమెరికాతరఫున వచ్చి ఆ సమావేశంలో పాల్గొన్నది. తదనంతరం ఆవిడ అమెరికా వారికి ఆసియాప్రజలు అమెరికానెందుకు నమ్మరో తెలియజెప్పింది. ఆవిడ చెప్పిన కారణాలు మూడు: (1) అమెరికా ఒక పవర్ బ్లాక్. తాను నిర్మాణకార్యక్రమం తలపెట్టి ఉండి ఇండియాకు అంతర్జాతీయ గుంజాటనలలో చిక్కుకోవటం ఇష్టంలేదు. (2) భారతీయులు రష్యాను విమర్శిస్తారుగాని కమ్యూనిజంమీద వారికి ఆదరం లేకపోలేదు. (ఒక నేతపారిశ్రామికుడు నెరాను, "ఏ దేశమైనా కమ్యూనిజం కోరితే మీ రెందుకు అడ్డం తగులుతారు ?" అని అడిగాడు.) పాకిస్తాను వారిలోకూడా ఇదే వైఖరి కనబడుతుంది. (3)యూరప్‌తో పోలిస్తే ఆసియాకు అమెరికా ఇవ్వజూపుతున్న సహాయం చాలా కొద్ది. ఈ కాస్తా పుచ్చుకున్నట్టయితే అమెరికా ఆసియా దేశాలను రష్యా వ్యతిరేక యుద్ధంలో ముంచుతుందేమో నని ఆసియా దేశాలకు భయం.

ఈ భయాన్ని అమెరికా పోగొట్టే స్థితిలో లేదు. ఒకవంక తనను నమ్మిన పశ్చిమరాజ్యాలకే అమెరికా సందేహాలు తెచ్చిపెడుతున్నది. ఈ అంపశయ్యనుండి అమెరికా ఎప్పుడు ఏవిధంగా విముక్తి చెందేదీ చెప్పటం సులభం కాదు.

## అమెరికాలో అలజడి

ఈ లోపల వాషింగ్టన్‌లో బ్రిటిషు ప్రధాని అట్లీ, అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ ఆరు సమావేశాలు జరిపిన ఫలిత మేమంటే, కొరియానుంచి ఐక్యరాజ్య సేనలు ఓడి పారిపోవట మనేది ఉండరాదనీ, అయితే రాజీబేరాలు సాగిస్తామనీనూ. దురాక్రమణదార్లను దువ్వటం జరగరాదని ఇద్దరూ ఒప్పుకున్నారు. అట్లీ ప్రయాణం ప్రమాదపరిస్థితి నివారిస్తుందన్న ఆశను ఈ నిర్ణయాలు బలపరచటంలేదు.

రాజీబేరాలకు పెకింగ్ ప్రభుత్వం ఒప్పుకున్నట్టు తెలియజేసినమాట నిజమే కాని, అమెరికా బ్రిటనులతో సమాన హోదా ఇస్తేనేగాని చీనా రాజీమాటలకు ఒప్పుకోదు. అమెరికా చీనాను గుర్తించటం విషయానికి ఇంకా సముఖంగా లేదు. ఈ విషయమై అట్లీ ట్రూమన్‌లకు రాజీ కుదరనేలేదు. యుద్ధంలో ఓడినా, రాజీపడి యుద్ధం మానినా కూడా చీనావారు అమెరికాను ఆవగింజంత సందివ్వకుండా దూరప్రాచ్యాన్నుంచి పంపిస్తారుగాని వదలరు. అమెరికాధోరణి దీనికి అనుకూలంగా లేదు కమ్యూనిజం ఎక్కడ తలఎత్తినా ప్రతిఘటించేదేనని అట్లీ ట్రూమన్‌లు ఒప్పుకున్నారుకూడానూ. ప్రస్తుతం దూరప్రాచ్యంలో సాంఘిక రాజకీయ చైతన్యం చూపుతున్నది కమ్యూనిజం ఒకటే.

తరవాత చీనా అమెరికాలకు రాజీ కుదిరినా కుదరకపోయినా ప్రస్తుతం అమెరికాలో పరిస్థితి అల్లరీ అయోమయంగా ఉంది. ఉత్తరకొరియాలో తగిలే దెబ్బలకు తట్టుకోలేక అమెరికాలో అనేకరకాల వారు అనేకరకాలుగా ఆర్భాటాలు సాగిస్తున్నారు. "కొరియానుంచి మన కుర్రాళ్లను బయటికి లాగండి" అని ఒకరూ, "కమ్యూనిస్టు దురాక్రమణదార్లను దువ్వే నమ్మకద్రోహులైన ఫ్రాన్సు, బ్రిటనులను" తిట్టిపోసేవారు మరొకరూ, అమెరికా విదేశాంగవిధానాన్నీ, చర్యలనూ తీవ్రంగా విమర్శించేవారు వేరొకరూనూ!

కాలిఫోర్నియా ప్రతినిధి అయిన సెనెటర్ నోలాండ్ (రిపబ్లికన్)అందరికీ హెచ్చరికలు పారేశాడు; చైనాను కొరియానుంచి బయటికి నడవమన్నాడు; అట్లీని "మ్యూనిక్" నుంచి వెళ్లిపొమ్మన్నాడు; చీనాజాతీయవాదులను ట్రూమన్ యుద్ధంలోకి దించాలన్నాడు; అమెరికా చీనా తీరదిగ్బంధం సాగించి, వెంటనే జపానుతో సంధి చేసుకుని, జపానువారికి ఆయుధాలిచ్చి వారిని యుద్ధంలోకి దింపాలన్నాడు!

మరొక డెమోక్రాటిక్ సెనెటర్ ఇదే ధోరణిలో మాట్లాడుతూ, చైనాజాతీయవాదులను యుద్ధంలోకి తీసుకోమనీ- అవసరమైతే కమ్యూనిస్టుచైనామీద అణువు

# మన దేశం

(4-వ పేజీ తరువాయి)

రేషనింగు విఫలమయినట్లు శాసనసభ్యులు చాలామంది ఒప్పుకున్నారుగాని అందులో రాష్ట్రప్రభుత్వం సంతోషించవలసింది ఏమీ లేదు. ప్రభుత్వం అసమర్థతే దానికి కారణమని చాలామంది అన్నారు.

అసలు అన్నిరకాల రేషనింగూ ఎత్తివేస్తే అన్నిబాధలూ విరగడైపోతాయన్న భావంకూడా చాలామందికున్నది. దీనికి కారణంకూడా ఆహారవిషయంలో ప్రభుత్వం చేసిన అకతవకలే. ధాన్యసేకరణ విషయంలోనూ, రేషన్లు అందించటం విషయంలోనూ ప్రభుత్వంపద్ధతి, "అవ్వ పెట్టా పెట్టదు, అడుక్కుతిననివ్వదు," అన్నట్టయింది.

## కొత్తపద్ధతి

ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం అవలంబించనున్న విధానం పూర్తిగా జేపూరుచీ విధానం. ప్రభుత్వ అంచనాల ప్రకారం - ఈ అంచనాలలో ప్రభుత్వానికి తప్ప మరెవ్వరికీ విశ్వాసం ఉన్నట్టు కనబడదు - మిగులు జిల్లాలనుండి మిగులులో కొంతభాగంమాత్రమే సేకరిస్తారు. మిగిలినది జిల్లాలమధ్య వ్యాపారం నడవటానికి వదులుతారు. తరుగుజిల్లాల నుండి ధాన్యం సేకరించరు. నగరాలలో మాత్రం రేషనింగు ఉంచి గ్రామాల్లో ఎత్తేస్తారు.

దీని ఫలితంగా జరిగే దేమిటంటే, అనంతకోటి గ్రామప్రజలు ఆహారంకోసం ఇదివరకులాగా ప్రభుత్వంపై ఆధారపడటం మాని ఇకముందు 'ధనికభూస్వాములపై ఆధారపడవలసివస్తుంది. ఏ వర్గం నుంచి ప్రజలను రక్షించటానికి రేషనింగు విధానం ఏర్పాటయిందో ఆ వర్గం పూర్తిగా విజృంభిస్తుంది. ఈ వర్గం ఇదివరకే విజృంభించలేదా అనవచ్చు. ప్రభుత్వం అవలంబించిన ఆహారవిధానంలో లోపం ఉన్నంతమేరకు విజృంభిస్తూనేఉన్నది. ఇప్పుడా కాస్త అంకుశముకూడా తొలగిపోతుందన్నమాట.

## మహతాబ్ చెప్పిన మాట

నాసిక కాంగ్రెసు అయిన తరవాత కేంద్రపరిశ్రమల శాఖామంత్రి హరికృష్ణమహతాబ్ కంట్రోలువిధానాన్ని సమర్థించుతూ, ప్రజలు ప్రతిఅవసరానికీ ప్రభుత్వంమీద ఆధారపడేపద్ధతిలో కంట్రోళ్ల రద్దు అసంభవమనీ, గాంధీజీసిద్ధాంతాలప్రకారం ప్రతిగ్రామం స్వయంపోషకంగా ఉంటూ, ఏది లేకపోయినా గడుపుకుపోతూ ప్రభుత్వాన్ని తిండిగాని, బట్టగాని అడగనిపద్ధతిలో అయితే కంట్రోళ్లు ఎత్తివేయటానికి తనకు అభ్యంతరం లేదని అన్నాడు. అది సవ్యమైన దృక్పథం. ఆహారంవిషయంలో మద్రాసురాష్ట్రం అవలంబించదలుచుకున్న విధానం దీనికి పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నది. కొన్ని నిలవలు ఉంచుతామనీ, క్లిష్టపరిస్థితి ఏర్పడితే ఆదుకుంటామనీ మద్రాసుఆహారమంత్రి అన్నమాట నిజమేగాని ప్రస్తుతం ఆయన జపించే పలాయనమంత్రం చూస్తే ఈ వాగ్దానాలు ఆశ గొల్పవు.

## అంధకారంలో ఆశారేఖ

ఒక్క మన రాష్ట్రంలోనే కాక దేశమంతటా అతి క్లిష్టంగా ఉన్న ఆహారపరిస్థితివల్ల కలిగిన అంధకారంలో ఒక్క ఆశారేఖ ఏమంటే కేంద్రఆర్థికమంత్రి చింతామణి దేశముఖు మరో ఆరుమాసాలఅవతల మన దేశానికి రోజు రోక ఆహారనౌక చేరేలాగు చూస్తాననీ, ప్రస్తుతం మన వాణిజ్యపరిస్థితి ఈ దిగుమతుల కనుకూలంగా ఉన్నదనీ అన్నాడు. ఇది నిజంగా శుభవార్తే.

ఏమంటే, కేంద్రప్రభుత్వం 1952 మార్చి తరువాత ఆహారదిగుమతులు పూర్తిగా నిలిపేస్తుందన్న వార్త చాలా సంక్షోభం కలిగించింది. ఒకవంక అధికాహారోత్పత్తి ప్రణాళికలు సరిగా పనిచేయలేదు. దేశం యొక్క ఆహారకొరత ఈ ప్రణాళికలు అమలుజరుగుతున్న కొద్దీ పెరుగుతున్నది. ఈ యేడు 40 లక్షల టన్నులకొరత అయితే వచ్చేయేడు 60 లక్షలటన్నులకు పెరుగుతున్నది. క్రమంగా కంట్రోళ్లు ఎత్తివేసేవైనం కూడా కాగితంమీదే ఉండిపోయిందిగాని ఆచరణలో మృగ్యమయింది. ఆహారవిషయంలో ప్రభుత్వం అవలంబిస్తూవచ్చిన విధానంలో కలిగిన మార్పులు, పరిస్థితి క్రమంగా బాగుపడుతున్నట్టు సూచించటం లేదు. మొదటినుంచీ కూడా కనిపించేది, ప్రభుత్వం తప్పులుచేసి దిద్దుకోవటమూ, ప్రణాళికలు వేసి అమలు జరుపలేకపోవటమూ, వ్యక్తులను మార్చటమూ, "సర్క్యుసు"లు సాగించటమూ, దీర్ఘప్రణాళికలకు- ప్రాజెక్టులు మొదలైన వాటికి- డబ్బు సాధించలేకపోవటమూ, సమస్యలనుండి పారిపోవటమూ మాత్రమే ఒక కంట్రోలు ఎత్తివేసినా, ఒక కొత్త పథకం వేసినా దాని వెనక ప్రభుత్వం అప్పటికి సాధించిఉన్న విజయం అంతో ఇంతో ఉండాలి. అది లేనప్పుడు ప్రభుత్వం తన విధానాన్ని ఎన్నిరకాల మార్చినా ప్రజలకు ఉత్సాహంగాని ఆశగాని కలగదు. మద్రాసు రాష్ట్రప్రభుత్వం గ్రామసీమల్లో కంట్రోలు ఎత్తివెయ్యటానికి నిర్ణయించిందంటే ఈ నిర్ణయానికి ముందుగాని వెనకగాని ప్రజలకు కనిపించేది పెద్ద పూర్ణానుస్వారమే అనాలి.

—రావు

---

బాంబులు వేయమనీ, రష్యా ఉపగ్రహ రాజ్యం ఏది ఇకమీద దురాక్రమణ జరిపినా అమెరికాకు గల సర్వశక్తులనూ రష్యామీద ప్రయోగించి యుద్ధం ప్రకటించమనీ అన్నాడు.

రెండోపక్షంకూడా లేకపోలేదు. జేమ్స్‌వార్బర్గ్ అనే ధనికుడి నాయకత్వం కింద కొందరు న్యూయార్కు పౌరులు ట్రూమన్ వద్దకు పోయి, యుద్ధం నిలపవలసిందనీ, కొరియానుంచి విదేశబలాలను పంపివేయవలసిందనీ, చైనా ఫార్మోజాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలిగించుకోవటం మానవలసిందనీ అర్థించారు.

మొత్తంమీద అమెరికాయే అట్టుడికిపోతున్నది. —రావు.

